క్లుప్తంగా

నేరాల నియంత్రణకు చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రమణకుమార్

కోట: కోట పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం గూడూరు డీఎస్పీ రమణకుమార్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల పురోగతి, చార్జిషీట్ల దాఖలుపై వివరాలు తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ గూడూరు డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వీటిపై జనాల్లో అవగాహన పెంచేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ వాడకం తప్పనిసరన్నారు. ఎస్‌ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లను ఎత్తేయాలి



మాట్లాడుతున్న మల్లికార్జున్

గూడూరురూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తూ అక్రమంగా సస్పెండ్ చేసిన కండక్టర్, డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపో వద్ద చేస్తున్న రిలే దీక్షలు ఆదివారంతో 11వ రోజుకు చేరుకుంది. రీజనల్ అధ్యక్షుడు మల్లికార్జున్, నేతలు వాసులు, రాము, ఎస్వీ క్రిష్ణ, రఘు, రమణయ్య, వినీలా, కిరణ్, సీఐటీయూ నాయకులు జోగి శివకుమార్, శ్రీనివాసులు, సురేష్, రమణయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో మేరి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం చెన్నైకి చెందిన దాతలు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు వృద్ధులకు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి చెన్నైకి చెందిన ఎఫ్‌వీఈఎం సంస్థ నిర్వాహకులు ఎఫ్.శామ్యూల్, ఆర్ఎస్.పాండ్యరాజ్, ఈ.జయరాములునాయుడు పేటలో ఉన్న ఆశ్రమానికి వచ్చి దుప్పట్లు పంపిణీ చేశారు. వీఆర్వో కె.పద్మనాభం, వైఎస్సార్‌సీపీ నేతలు పసల హరిబాబు, ఆశ్రమ నిర్వాహకులు సునిత, బెన్ని పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల గొడవపై విచారణ

కోట: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు సిబ్బంది మధ్య వివాదం నెలకొని పరస్పరం దాడులకు పాల్పడిన సంఘటన ఆదివారం కోటలో చోటుచేసుకుంది. కోట సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కిరణ్‌పై జేఎల్ఎంగా పనిచేస్తున్న చంద్రశేఖర్ రాడ్డుతో తలపై దాడి చేయడంతో తీవ్ర గాయమైంది. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దాడి ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ఉపాధి సిబ్బందిపై క్రిమినల్ కేసులు

కలువాయి: మండలంలో ఆరుగురు ఉపాధి హామీ సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ ఆదివారం తెలిపారు. వివరాలు.. మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవినీతి జరిగినట్లు అధికారులు విచారణలో తేల్చారు. ఈ నేపథ్యంలో వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఉన్నతాధికారులు ఎంపీడీఓ డీవీ నరసింహారావును ఆదేశించిన విషయం విదితమే. ఆ మేరకు ఎంపీడీఓ శుక్రవారం కలువాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చినగోపవరం ఎఫ్ఏ మహేంద్రరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ బాబూ రాజేష్, సాంకేతిక సహాయకులు ఆర్.ప్రసన్న, ఎంవీ.ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జే.శ్రీనయ్యపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

జగనన్న కాలనీలో కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న సీఐ రమణ

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని జగనన్న కాలనీలో సీఐ ఏవీ రమణ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పోలీసు సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల ఎస్‌ఐలు, సిబ్బందితో కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఈ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 9 స్కూటర్లు, ఒక ఆటోను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే వాహనాలను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఎస్‌ఐలు సుబ్బారావు, గోపి, శివశంకర్‌రావు పాల్గొన్నారు.

జలసంరక్షణ పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



పలుగోడులో జల సంరక్షణ కింద పూర్తి చేసిన ఇంకుడు గుంత



ఉజ్వలంగా ఉండాలని!

- ముమ్మరంగా జల సంరక్షణ పనులు
- పనుల గుర్తింపులో ఉపాధి అధికారులు
- పనుల నిర్వహణపై సిబ్బందికి శిక్షణ

డక్కిలి: జల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు వాటిని సంరక్షించుకుంటే రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి నుంచి గట్టెక్కవచ్చునని భావిస్తోంది. ఈమేరకు వచ్చే ఏడాది నుంచి ఉపాధి హామీలో జలసంరక్షణ పనులు విరివిగా చేయాలని సూచించింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రజలకు అవగాహన కల్పించడానికి వివిధ రకాల కార్యక్రమాలను రూపకల్పన చేసింది. దీనిపై క్షేత్ర సహాయకులకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు.

ఉపాధి పథకం కింద జల సంరక్షణలో చేసే పనుల్లో ముఖ్యంగా వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వల గుంతల నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. సింగిల్ ఫేజ్ మోటార్లు చేతి పంపుల వద్ద, ఇళ్లలో వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపడతారు. ఇంటిపై భాగంలో కురిసిన వర్షపు నీటిని భూమిలోకి వెళ్లేలా (రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్)నిర్మాణాలు, ఖాళీ స్థలాలు, పంట పొలాల చుట్టూ కందకాలు ఏర్పాటు, అనువైన చోట చిన్నపాటి కుంటల నిర్మాణాలు చేపట్టనున్నారు. డక్కిలి మండలంలో 9,143 జాబ్‌కార్డులు ఉండగా, అందులో 7,124 యాక్టివ్ జాబ్‌కార్డులు ,15,488మంది కూలీలుగా నమోదయ్యారు. ప్రస్తుతం 11,158 మంది పనిచేస్తున్నారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించిన పనులను ఆ ఏడాదిలోపు పూర్తిచేయాలని, మరుసటి ఏడాది ఉపాధి హామీ కింద వాటిని చేయరాదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిబంధనలు విధించింది. ఈనేపథ్యంలో గ్రామసభలో చేసే తీర్మానాలతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభించడానికి గ్రామీణాభివృద్ధి ప్రణాళికలను సిబ్బంది రూపొందిస్తోంది.

కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో 2025–26లో ఉపాధి హామీలో చేసే జల సంరక్షణ పనులను క్షేత్ర స్థాయిలో గుర్తించేందుకు ఆ శాఖ అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. డిసెంబర్ నాటికి పనుల గుర్తింపు పూర్తి చేసి వాటిని ప్రారంభించడానికి అనువుగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఇంకుడు గుంతల పరంగా..

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలనుకునేవారు ఇక నుంచి తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలన్న నిబంధన అమల్లో ఉంది. కానీ క్షేత్ర స్థాయిలో దీన్ని ఎవరూ పాటించడంలేదనేది స్పష్టమవుతోంది. పలువురు లక్షలాది రూపాయలు వెచ్చించి ఇళ్లు నిర్మించుకుంటున్నారు. కానీ వేలాది రూపాయలు ఖర్చయ్యే ఇంకుడుగుంతల విషయంలో మాత్రం ప్రభుత్వం శద్ధ వహించడంలేదు. దీంతో నీటి సంరక్షణకు అడుగులు ముందుకు పడడం లేదు. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టడానికి ఇంకుడు గుంతలు నిర్మిస్తేనే ఇళ్ల నిర్మాణ అనుమతులు ఇచ్చే విధంగా ప్రభుత్వం నిబంధనలు రూపొందించి వాటిని కచ్చితంగా ప్రజలు అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది.

> **జలసంరక్షణ పనులపై శిక్షణ**
>
> 
>
> గ్రామాల్లో జల సంరక్షణకు చేపట్టాల్సిన పనులపై ఉపాధి క్షేత్ర సహాయకులకు శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో వారు పనులను గుర్తించి వాటిని సకాలంలో పూర్తి చేసేలా శిక్షణ ఇస్తాం. ముఖ్యంగా గ్రామంలో జల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా ఇళ్ల వద్ద ఇంకుడుగుంతలు తవ్వకం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.
>
> – దామోదర్‌రాజు, ఉపాధి, ఈసీ

దళిత నేతకు నివాళి

కోట: పట్టణానికి చెందిన దళిత నేత, అంబేడ్కర్ ఆశయ సాధన సమితి అధ్యక్షుడు ఆర్వీ రమణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈక్రమంలో ఆయన సంస్మరణ సభను ఆదివారం కోటలో నిర్వహించారు. పలువురు దళిత సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలు, దళితుల సమస్యలు, హక్కుల కోసం ఆర్వీ రమణయ్య పోరాటం చేశారని పలువురు ప్రముఖులు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఆదినారాయణ, రమేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ప్రీ క్రిస్మస్ వేడుకలు

కోట: స్థానిక బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్ పండగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అయితే స్థానిక బీజేపీ నాయకులు కొందరు పాఠశాల వద్దకు చేరుకుని విద్యార్థులకు బైబిల్ గురించి చెప్పడాన్ని ఖండిస్తూ ప్రిన్సిపల్‌ను ప్రశ్నించారు. పాఠశాలలో మతపరమైన కార్యక్రమాలు జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్‌బాబు, వాసు, చేవూరు శ్రీనివాసులు, అంబరీష పాల్గొన్నారు.

కండలేరులో 56.832 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 56.832 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ ద్వారా 250 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తుందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 520, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 150, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సభను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

వాకాడు: జనవరి 5న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభకు హిందువులంతా తరలివచ్చి విజవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ధర్మప్రచారకుడు సాయిరాం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు నెల్లిపూడి దేశమ్మ ఆలయంలో హిందూ దైవ భక్తులతో మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హైందవ శంఖారావం కరపత్రాలను ఆవిష్కరించారు. ధర్మప్రచారకుడు విశ్వనాథం, వాకాడు మండల కన్వీనర్ కె.కొండయ్య, పంచాయతీ కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక గ్రీవెన్స్ రద్దు

గూడూరురూరల్: గూడూరు డివిజన్ పరిధిలోని గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల ప్రజల కోసం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం గూడూరులో నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్‌ను అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆదివారం తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం సోమవారం గూడూరులో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకటించామన్నారు. అయితే అనివార్య కారణాల వల్ల కలెక్టర్ హాజరు కాలేక పోతుండడంతో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

25న బౌద్ధధర్మ స్వీకార మహోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రామచంద్రరావు

వెంకటగిరిరూరల్: అంబేడ్కర్ ధర్మపోరాట సమితీ (ఏడీపీఎస్) ఆధ్వర్యంలో నవయాన బౌద్ధధర్మ స్వీకార మహోత్సవాన్ని ఈనెల 25న నిర్వహించనున్నట్లు ఏడీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాస్టర్ రామచంద్రారావు ఇంగిలాల అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఆదివారం నవయాన బౌద్ధధర్మ స్వీకార మహోత్సవం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25న 7వ సారి నెల్లూరులోని డాక్టర్ అంబేడ్కర్ భవనంలో ఉదయం 10 గంటలకు బౌద్ధధర్మ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడీపీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగిటి వెంకటయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షుడు గుండవోలు గోపాల్, మండల అధ్యక్షులు జి.శ్రీనివాసులు, మండల కార్యదర్శి హరి జైభీమ్, నేతలు రమేష్, చలపతి, వరకుమార్, కృష్ణయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

జలసిద్ధేశ్వరస్వామి ఆలయ కమిటీ ఏర్పాటు



జలసిద్ధేశ్వరస్వామి నూతన కమిటీ

వాకాడు: మండలంలోని నెల్లిపూడి పంచాయతీ వెంకటరెడ్డిపాళెంలో వెలసిన శ్రీ కామాక్షిదేవి సమేత జలసిద్ధేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించి ఆదివారం నూతన కమిటీ ఎన్నికైంది. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. అందులో ప్రెసిడెంటుగా బి.కస్తూరయ్య, వైస్ ప్రెసిడెంట్ కె. హరీష్, ఎం.కోటయ్య, ట్రెజరర్ సూరిశెట్టి విజయ్‌కుమార్, బాలు, మురళి, సభ్యులు వెంకటసుబ్బయ్య, జగన్, అనిల్‌రెడ్డి ఎన్నికయ్యారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన కృష్ణయ్య

దొరవారిసత్రం: ముందు వెళుతున్న బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి వెదురుపట్టు గ్రామ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు..అక్కరపాక గ్రామానికి చెందిన ఎం.కృష్ణయ్య బైక్‌లో దొరవారిసత్రానికి వెళుతున్నాడు. ఆసమయంలో వెనుక నుంచి వస్తున్న కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో బైక్‌లో ప్రయాణిస్తున్న కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవుని మార్గంలో నడవాలి



కేక్ కట్ చేస్తున్న పాస్టర్

ఓజిలి: నేటి సమాజంలో యువత దేవుని మార్గంలో నడవాలని స్థానిక జాన్ లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ రాజరత్నం పిలుపునిచ్చారు. ఓజిలిలోని చర్చిలో క్రిస్మస్ పండుగకు ముందుగా నిర్వహించే యూత్ క్రిస్మస్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం దైవ సందేశం ఇచ్చారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసిన అనంతరం యువతీ, యువకులు పలు గీతాలు ఆలపించారు. అలాగే కొంత మంది యువతీ యువకులు ప్రదర్శించిన స్కిట్‌లు అందరినీ అలరించాయి. అనంతరం చర్చి పెద్దలు పేదలకు నూతన దుస్తులను అందజేశారు. చర్చి పీసీసీ, ఎల్‌సీసీ, మహిళా సమాజా సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆసక్తి పెంచుకుంటే గణితం సులభమే!



గణిత ఉపాధ్యాయులను సత్కరించిన యాజమాన్యం

గూడూరురూరల్: చిన్నతనం నుంచి గణితం సబ్జెక్టు వచ్చిందంటే చాలా మంది విద్యార్థులు భయపడుతుంటారని అయితే ఆసక్తిని పెంచుకుంటే చాలా సులభతరంగా ఉంటుందని పలువురు గణిత ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గూడూరులోని గాయత్రి ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో రామానుజన్ జయంతి సందర్భంగా ఆదివారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో చదివే విద్యార్థులు 100 నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. వీటిని తిలకించిన పలువురు గణిత ఉపాధ్యాయులు చిన్నతనం నుంచే గణితంపై పట్టు సాధిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అన్నారు. అనంతరం పలువురు గణిత ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. నారాయణ కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ కల్యాణ కుమార్, గణిత ఉపాధ్యాయులు గురుగుహ, సామి, సురేష్‌బాబు, కోదండరామ్, కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు రఫీ, ధనశ్రీ, శ్రీహరిబాబు, సోనియా పాల్గొన్నారు.

ఆసక్తి ఉంటే వయస్సు అడ్డంకి కాదు



ఫ్యాషన్ డిజైన్ చేస్తున్న మహిళలను అభినందిస్తున్న ప్రతినిధులు

చిల్లకూరు: ఆసక్తి ఉంటే వయస్సుతో పనిలేకుండా ఏ రంగంలోనైనా రాణించవచ్చని సునీతా సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి తెలిపారు. గూడూరు పట్టణంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదలకు ఫలసరుకుల పంపిణీ



ఫలసరుకులు అందిస్తున్న సంఘ నేతలు

చిల్లకూరు: పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం గుణ్ణం సేవా ట్రస్టు దాతృత్వంతో 25 మంది పేదలకు నెలకు సరిపడా ఫలసరుకులను వితరణగా అందజేశారు. ట్రస్టు నిర్వాహకులు గుణ్ణం మధుసూదన్‌రెడ్డి, రాధమ్మల దంపతులు, సంక్షేమ సంఘం ప్రతినిధులు శ్రీనివాసులరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, జైపాల్‌రెడ్డి, రాధాక్రిష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



మృతిచెందిన చుక్కల దుప్పి

చిల్లకూరు: అటవీ ప్రాంతం నుంచి జనారణ్యంలోకి వచ్చిన చుక్కల దుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఆదివారం రైటార్ సత్రం వద్ద చోటుచేసుకుంది. అటవీశాఖాధికారులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కడివేడు ఫారెస్టు నుంచి ఓ చుక్కల దుప్పి దారి తప్పి జాతీయ రహదారిపైకి వచ్చింది. ఈ క్రమంలో రైటార్ సత్రం వద్ద దుప్పి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు దుప్పి మృతిపై చిల్లకూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకుని అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అటవీ అధికారులు మృతిచెందిన దుప్పికి చిల్లకూరు పశువైద్యుల చేత పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం కడివేడు అటవీ ప్రాంతంలో దహనం చేసినట్లు అటవీశాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు.

వృద్ధులకు కంబళ్ల వితరణ



వృద్ధులకు కంబళ్లు పంపిణీ చేస్తున్న రవీంద్రబాబు

చిల్లకూరు: గూడూరు మండల పరిధిలోని కందలి గ్రామంలోని సీయోను ప్రార్థనా మందిరంలో వృద్ధులకు కంబళ్లను వితరణగా అందజేశారు. ఆదివారం సపోజ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. సంఘ కాపరి బాబ్జి వాక్య సందేశం ఇచ్చారు. గూడూరుకు చెందిన రిటైర్డ్ టీచర్ కూరపాటి మెర్సమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు కంబళ్లను వితరణ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమి టీ సభ్యులు రవీంద్రబాబు, బాస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి సుప్రియ, యశ్వంత్, భావన పాల్గొన్నారు.

పర్యవేక్షణ లోపం..రహదారికి శాపం

–రూ.2కోట్ల రహదారి..మూన్నాళ్ల ముచ్చటే



దెబ్బతిన్న రహదారి

సైదాపురం: మండల కేంద్రంలో ఇటీవలే రూ.2కోట్ల వ్యయంతో చేపట్టిన రహదారి పనులు మూన్నాళ్ల ముచ్చటగా మారింది. రహదారి నిర్మాణ పనుల సమయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఈ రహదారి కొద్ది రోజులకే దెబ్బతింది. కైవల్యానది వంతెన వద్ద నుంచి రాపూరు రహదారి వరకు దెబ్బతిన్న పనులకు ప్రత్యేక గ్రాంట్ కింద కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ హడావుడిగా గుట్టుచప్పుడు కాకుండా పనులను మొదలు పెట్టారు. ఆసమయంలో మండల ప్రజలు కూడా రహదారి నిర్మాణ పనులు చేస్తుండడంతో ఎంతగానో సంతోషపడ్డారు. చివరకు రోడ్డుకు వేసిన కంకర్ కూడా లేచిపోతుండడంతో ప్రజల సంతోషం కొద్దిరోజులేనా అనే సామెత గుర్తుకు వస్తుంది. పనులు చేసే సమయంలో సంబంధిత అధికారులు లేకపోవడంతో పలు విమర్శలు చోటుచేసుకున్నాయి. పనులు పూర్తి అయిన రెండు నెలల్లోనే రోడ్డు గుంతలమయంగా మారింది. ఈవిషయమై సంబంధింత డీఈని వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశామని ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో దెబ్బతిన్న పనులను చేయలేకపోతున్నామన్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఈ రహదారి నిర్మాణ పనులపై విచారణ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రేకుల షెడ్డులోనే చదువులు

- దుస్థితిలో మీజూరులో ప్రాథమిక పాఠశాల
- కొన్నేళ్లుగా అసంపూర్తిగా అదనపు భవనం
- ఇబ్బందుల మధ్య విద్యార్థుల చదువులు



రేకుల షెడ్‌లోనే తరగతుల నిర్వహణ, పక్కనే అసంపూర్తిగా అదనపు భవనం

దొరవారిసత్రం: తీరప్రాంతమైన మీజూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల 20ఏళ్ల పైబడి నుంచి ఓ రేకుల షెడ్‌లోనే విద్యార్థుల ప్రాథమిక చదువులు కొనసాగుతున్నాయి. వర్షం వస్తే షెడ్ ఉరుస్తుంది. సరైన వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో స్థానికంగా విద్యను అభ్యసించే 23 మంది విద్యార్థుల ఇబ్బందులు అంతాఇంతాకాదు. కనీసం విద్యార్థులకు అవసరమైన తాగు నీటి వసతి, మరుగుదొడ్డి సదుపాయాలు లేనందున ప్రతిరోజూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా రేకుల షెడ్ కూడా క్రమేపి దెబ్బతింటోంది. ఒకే గది కావడంతో విద్యార్థులు అందరూ చాలా ఇబ్బందులు పడి కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పదేళ్లుగా నిర్మాణ దశలోనే..

మీజూరు పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం గత టీడీపీ హయాంలో అదనపు భవనం రూ.5లక్షల వ్యయంతో మంజూరు చేశారు. ఈ భవనం పనులకు దక్కించుకున్న అప్పటి కాంట్రాక్టర్ శ్లాబ్ వరకు పూర్తిచేసి అర్ధంతరంగా వదిలేశాడు. ఈ పనులను పర్యవేక్షించే అధికారులు కానీ, సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో అప్పటి నుంచి నేటి వరకు అదనపు భవనం పనులు క్రమేపి దెబ్బతింటూ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇప్పటికే శ్లాబ్ దెబ్బతింది. అదేవిధంగా అప్పటిలోనే వంటి గది కూడా నిర్మించారు. దీనికి పూత వెయ్యకుండా వదిలేశారు. ఈ నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకోకముందే పూర్తవుతాయాలేదాని స్థానికులు అంటున్నారు. మరుగుదొడ్లు నీటి వసతి లేక గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారాయి.



దెబ్బతింటున్న అదనపు భవనం



పూత లేని వంట గది